క్లుప్తంగా

వైద్య సేవల తీరుపై తనిఖీ



వడ్లమూరు వెల్ సెంటర్‌ను సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ అధికారులు

కపిలేశ్వరపురం: అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలోని వడ్లమూరులోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)లో వైద్య సేవలందుతున్న తీరును మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు వర్చువల్‌గా తనిఖీ చేశారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం నుంచి క్వాలిటీ డిస్ట్రిక్ట్ క్వాలిటీ కన్సల్టెంట్ కె.సునీత పీహెచ్‌సీలో సేవల పరిస్థితి తనిఖీ చేశారు. కేంద్రంలో రోగుల సందర్శన, రికార్డులు నిర్వహణ, మందులు, తదితర అంశాలు వారీగా ఆసుపత్రి అధికారులను ఆరా తీశారు. రోగులను సేవలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ గోపాలకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ జి.వరలక్ష్మి, సిబ్బంది డి.సుబ్బాయమ్మ, సీహెచ్ శ్రీరాంబాబు, వైద్య,ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుండపోత




కె.గంగవరంలో కురుస్తున్న వర్షం

కె.గంగవరం: రుతుపవనాల ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు మండల వ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం నుంచి చినుకుచినుకుగా కురిసిన వర్షం సాయంత్రానికి జోరందుకుంది. వర్షం ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లోని పల్లప్రాంతాలు నీటి మునిగాయి. కె.గంగవరం మండలంలోని ప్రధాన కాలువలు వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోజంతా వర్షం పడడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

దొంగతనం కేసులో ముద్దాయిల అరెస్ట్

కె.గంగవరం: మండలంలోని పామర్రులో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో ముద్దాయిలను కె.గంగవరం పోలీసులు అరెస్ట్ చేశారు. కె.గంగవరం ఎస్సై జానీబాషా తెలిపిన వివరాల ప్రకారం పామర్రులోని రావిచెట్టు వీధిలో దేవరపల్లి సత్యవతి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఉంగరం , ఇత్తడి సామాన్లు దొంగింలించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేశారు. రామచంద్రపురం మండలం తాళ్లపొలంకు చెందిన పప్పుల ప్రభుకుమార్, ద్రాక్షారామ నున్నవారి వీధికి చెందిన కోడూరి వెంకటేష్‌లను ముద్దాయిలకు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పోయిన సొత్తును రికవరీ చేశారు. దీంతో పాటు కరప పోలీస్‌స్టేషన్ పరిధిలోని అరట్లకట్ట గ్రామంలో వీరు చోరీ చేసిన బంగారు చైన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. కె.గంగవరం పోలీసులు సమన్వయంతో విజయవంతంగా దర్యాప్తు చేసి ముద్దాయిలను న్యాయపరమైన చర్యల కోసం కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

పంటకాలువలో మృతదేహం



పంట కాలువలో లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం

రామచంద్రపురం రూరల్: మండలంలోని భీమక్రోసుపాలెం గ్రామంలోని పంట కాలువలో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ విలేకరులకు తెలిపారు. సుమారు 35–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పురుషుని మృతదేహం ముఖం గుర్తించడానికి వీలు లేకుండా ఉబ్బిపోయిన స్థితిలో ఉన్నట్లు తెలిపారు. మృతుని ఒంటిపై తెలుపు రంగు గీతలు కలిగిన పింక్ రంగు ఫుల్ హాండ్స్ షర్టు, నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు తన ఫోన్ నంబరు 94409 04850 నంబరు పై సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

గురుస్వామి శర్మ దంపతులకు ఘన సన్మానం

కొత్తపేట: మండలంలోని వాడపాలెం జ్ఞాన సరస్వతీదేవి, అయ్యప్ప స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు, అయ్యప్ప దీక్ష గురుస్వామి దొంతికుర్తి రామచంద్రశర్మ దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. రామచంద్రశర్మ 2017 నుంచి వాడపాలెంలో ఆలయ ప్రధాన అర్చకుడిగా సేవ చేస్తున్నారు. సుదీర్ఘ కాలంగా ఆయన అయ్యప్ప మాల ధరిస్తున్నారు. ఏటా అత్యధిక సంఖ్యలో స్వామి అయ్యప్ప మండల, జ్యోతి దీక్ష మాలధారులు రామచంద్రశర్మ చేతుల మీదుగా అయ్యప్పమాల ధరించడం, 41 రోజుల అనంతరం ఇరుముడులు కట్టించుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం అయ్యప్ప మండల దీక్ష చేపట్టిన నేపథ్యంలో వాడపాలెం ఆలయ ప్రాంగణంలో గురుస్వామి రామచంద్రశర్మ–ఆదిలక్ష్మి దంపతులను శాలువాలు, నూతన వస్త్రాలతో సత్కరించారు.

కాసుల కోసం కక్కుర్తి

- నకిలీ మద్యంతో ప్రమాదంలో ప్రజారోగ్యం
- అక్రమార్జనలో కూటమి నేతలు
- సీబీఐ విచారణకు వెనకడుగు
- మండపేటలో ఎమ్మెల్సీ తోట నిరసన ర్యాలీ



మండపేటలో ర్యాలీగా సాగుతున్న ఎమ్మెల్సీ తోట తదితరులు

కపిలేశ్వరపురం: రాష్ట్రంలో కూటమి నేతలు కాసుల కోసం నకిలీ మద్యం విక్రయాలకు పాల్పడుతున్నారని, ఫ్యాక్టరీ పెట్టి నకిలీ మద్యం తయారు చేసే స్థాయిలో నకిలీ మద్యం తీరు నడుస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం విక్రయాలను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం మండపేట పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మినగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకూ ర్యాలీ, అనంతరం మెయిన్ రోడ్డు నుంచి పట్టణ మెయిన్‌రోడ్డు, బస్‌స్టాండ్ కలువ పువ్వు సెంటర్, కేపీ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ర్యాలీ అగ్రభాగాన కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీలు మేడిశెట్టి సత్యవేణి, నౌంద్రు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల కన్వీనర్లు పిల్లి శ్రీనివాస్, అడబాల బాబ్జి, గూటం సత్యనారాయణ, వెలగల సత్యనారాయణరెడ్డి నడిచారు. ×నకిలీ మద్యంలో ఉన్న వ్యక్తులను అరెస్టు చేయాల్సి, నకిలీ మద్యం విక్రయాల ప్రభావాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి₹, నకిలీ మద్యం విక్రయాలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలంటూ ఎమ్మెల్సీ తోట, తదితరులు నినాదాలు చేశారు. బస్టాండ్, కలువపువ్వు సెంటర్లలో ప్రజలనుద్దేశించి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, పార్టీ సీనియర్ నాయకులు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాధాకృష్ణ మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో విచ్చలవిడిగా ఉన్న బెల్ట్ షాపులను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పరిమిత సంఖ్యలో ప్రభుత్వం నిబంధనలు మేరకు గ్రామాల శివారున మద్యం షాపులను నిర్వహించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తిరిగి మద్యం ఏరులైపారుతుందని, బడి, గుడి, జనావాసాల్లో మద్యం షాపులను నిర్వహిస్తున్నారన్నారు. ప్రజా రోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నకిలీ మద్యం రద్దుకై ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ కాసులు కోసం కూటమి నేతలు అధినేతలు స్థాయి నుంచి క్షేత్ర స్థాయి నాయకులు వరకూ మద్యం అక్రమ విక్రయాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలోని మద్యం విధానంపై దుష్ప్రచారం చేసిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాకా నకిలీ మద్యం విక్రయాలకు పాల్పడుతున్నారన్నారు. అది ఏపాటి నీతో ప్రజలకు సీఎం చంద్రబాబు చెప్పాలన్నారు. ఫ్యాక్టరీలో నకిలీ మద్యాన్ని తయారు చేసి క్షేత్ర స్థాయిలో విక్రయాలకు పాల్పడుతున్న వైనం బహిర్గతమైందన్నారు. ఫ్యాక్టరీపై దాడి చేసి పట్టుకుని ప్రజల ముందు పెట్టినా కూడా కూటమి నేతలు కల్లబొల్లి కబుర్లు చెప్పటం వారి విజ్ఞతను తెలియజేస్తుందన్నారు. నకిలీ మద్యం తాగి సామాన్యులు తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారన్నారు. మహిళాభ్యుదయాన్ని చాటి చెప్పే ప్రభుత్వంగా కబుర్లు చెబుతున్న కూటమి నేతలు నకిలీ మద్యంపై ప్రజలకు ఏం చెబుతారని ప్రశ్నించారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బెల్ట్ షాపులు లేనేలేవని, కూటమి పాలనలో వేలం నిర్వహించి మరీ బెల్ట్ షాపులను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వేలం నిర్వహిస్తున్నారంటే బెల్ట్ షాపు ద్వారా కూటమి నేతలు ఎంత మేర కాసులు సంపాదిస్తున్నారో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. బెల్ట్ షాపు నిర్వహిస్తే బెండు తీస్తానంటూ బీరాలు పలుకుతున్న చంద్రబాబు క్షేత్ర స్థాయిలోకి వస్తే బెల్ట్ షాపులను తామే చూపిస్తామన్నారు. రాష్ట్రంలో కీలకంగా మారిన నకిలీ మద్యం విక్రయాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ద్వారా విచారణ చేయాలని వైఎస్సార్ సీపీ నేతలు అడుగుతుండగా రాష్ట్ర ప్రభుత్వ హయాంలోని సిట్ సంస్థతో విచారణ చేయిస్తామనడంలో ఉన్న ఆంతర్యాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. నకిలీ మద్యం కేసులో కీలకంగా ఉన్న జనార్దన్ సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని విచారణ చేస్తే వాస్తవాలు బయటపడతాయన్నారు. కాని పక్షంలో ప్రజల ముందు కూటమి ప్రభుత్వం దోషిగా నిలవాల్సిందేనన్నారు. నకిలీ మద్యంపై పూర్తి విచారణ చేపట్టాలంటూ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దూలం వెంకన్నబాబు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, పోతంశెట్టి ప్రసాద్, కురుపూడి రాంబాబు, పి.సత్యనారాయణ, సాధనాల శివభగవాన్, సలాది వీరబాబు, పలివెల మధు, పేరాబత్తుల రామకృష్ణ, నక్కా సింహాచలం పాల్గొన్నారు.



మండపేటలో తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట తదితరులు

దీపావళి ఆనందంగా చేసుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: పేలుళ్లతో సంబంధం లేని ఆనందకర దీపావళిని చేసుకునేందుకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు సూచించారు. రాయవరం పోలీస్‌స్టేషన్‌లో వారు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాణం చాలా విలువైనదన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఎక్కడైనా అక్రమ నిల్వలు ఉన్నట్టు గుర్తిస్తే చుట్టుపక్కల వారు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. జనావాసాల మధ్య సొంతానికి మతాబులు, చిచ్చుబుడ్లు తదితర బాణసంచా తయారు చేసినా, నిల్వలు ఉంచినా కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జనావాసాల మధ్య చిన్న పాటి నిలలు ఉంచినా కేసులు నమోదు చేస్తామన్నారు. పరిసర ప్రాంతాల్లో బాణసంచా నిల్వలు గుర్తిస్తే సమీప ప్రజలు 9440796537, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన స్థలాల్లో మాత్రమే రిటైల్ అమ్మకాలు సాగించాలన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడేకన్నా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే దీపావళిని అందరూ సంతోషంగా చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

జీవన ఎరువులతో భూసారం వృద్ధి



తిప్పరాజుపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏరువాక శాస్త్రవేత్త సీతారామశర్మ

కాజులూరు: రైతులు పొలాల్లో జీవన ఎరువులను వినియోగించడం ద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గడమే కాకుండా భూసారం వృద్ధి చెంది అధిక దిగుబడులు సాధించగలుగుతారని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పెద్దాపురం ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ.సీతారామ శర్మ అన్నారు. మంగళవారం తిప్పరాజుపాలెంలో మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ ఆధ్వర్యంలో జీవన ఎరువులు ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సీతారామశర్మ మాట్లాడుతూ జీవన ఎరువులు వాడే విధానం, లాభాలను రైతులకు వివరించారు. జీవనఎరువులైన అజోస్పిరిల్లం, పాస్ఫరస్ సొల్యూబలైజింగ్ బ్యాక్టీరియా, పొటాష్ సొల్యూబులైజింగ్ బ్యాక్టీరియా మొదలైన జీవన ఎరువుల వాడకం వలన సుమారుగా 25 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గడంతో పాటు భూసారాన్ని, భూ ఆరోగ్యాన్ని , రైతుకు పెట్టుబడి ఖర్చును కూడా తగ్గించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాళ్ళ ఆంజనేయ ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

43 మందికి ఉచిత కంటి పరీక్షలు

పి.గన్నవరం: మండలంలోని ముంగండలో మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 43 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వారిలో 14 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసేందుకు నిర్ధారించి, వేమగిరి కంటి ఆస్పత్రికి తరలించినట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యానికి సహకరించాలి

అంబాజీపేట: సంపూర్ణ పారిశుధ్యానికి ప్రతి ఒక్కరూ సహకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతాలక్ష్మి అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం డీపీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. డీపీఓ మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరువేరుగా ఉంచాలని వాటిని పంచాయతీ పారిశుధ్య కార్మికులు తీసుకువెళతారన్నారు. తడి, పొడి చెత్త పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. సంపూర్ణ పారిశుధ్య గ్రామానికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్, పంచాయతీ అధికారి సీహెచ్.డీఎస్.మౌనిక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపత్కాలంలో అవగాహనతో మెలగాలి



అంగర సిద్ధార్థ కళాశాలలో సీపీఆర్ విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

కపిలేశ్వరపురం: ఆకస్మాత్తుగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న వారిని అవగాహనతో కాపాడవచ్చని అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, డిప్యూటీ హెచ్‌ఈఓ బి.రామారావు, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.దేవి అన్నారు. అంగర సిద్ధార్థ కళాశాలలో మంగళవారం అత్యవసర సమయంలో గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న వ్యక్తిని కాపాడే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్‌ఎస్‌డీ రత్నకుమారి ఆధ్వర్యంలో సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర సమక్షంలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. విద్యార్థులతో ప్రయోగాత్మకంగా సీపీఆర్ విధానాన్ని వివరించారు. లింగ వివక్షకు పాల్పడిన వారిని చట్ట పరిధిలో శిక్షించే పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వాకా రాజా, చైర్మన్ డాక్టర్ వి.దివ్యశేఖర్, ప్రిన్సిపాల్ పి.రమణ, అధ్యాపకులు, హెచ్‌వీ టి.మేరీమణి, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ అమలుతో భవన నిర్మాణ ఖర్చులు తగ్గుదల

కమర్షియల్ టాక్స్ జేసీ రవికాంత్



సూపర్ జీఎస్టీపై అవగాహన కార్యక్రమంలో సీటీవో జేసీ రవికాంత్, ఆర్డీవో అఖిల తదితరులు

రామచంద్రపురం: నూతన జీఎస్టీ విధానంతో భవన నిర్మాణ రంగ వినియోగదారులకు, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్లను సవరించిందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమర్షియల్ టాక్స్ జేసీ రవికాంత్, ఆర్డీవో దేవరకొండ అఖిల అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా స్థానిక ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో జీఎస్టీ తగ్గింపు అవగాహన సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వారు జీఎస్టీ నూతన విధానాన్ని, ప్రభుత్వ ఉద్దేశాన్ని సభలో వివరించారు. ఒక దేశం ఒక పన్ను నినాదంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ రంగంలో ఉన్నవారికి జీఎస్టీ తగ్గింపు సాంత్వన కలిగిస్తుందన్నారు. గతంలో 4 శ్లాబులుగా ఉన్న జీఎస్టీను 2 శ్లాబ్‌లుగా సంస్కరించి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో స్టేట్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ పి.సత్యనారాయణ, మున్సిపల్ డీఈ శ్రీకాంత్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొవ్వూరి తాతారెడ్డి, నాయకులు చందమామ వాసు, కడియాల రాఘవన్, కవల నానాజీ, మేడిశెట్టి శేషారావు, మేడిశెట్టి సూర్యానారాయణ, నారపురెడ్డి బలరాం, భవన నిర్మాణ ప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడి వైద్యానికి రూ.15 వేల సాయం

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి అనారోగ్యం పాలైన బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి చెందిన నల్లమిల్లి సత్తిరెడ్డి (79) గతంలో యాక్సిడెంట్ అయ్యి కాలికి రాడ్లు వేశారు. అది ఇప్పుడు ఇన్ఫెక్షన్‌కి దారి తీసింది. ఈయన ముగ్గురు కొడుకుల్లో ఇద్దరు చనిపోయారు. ఇంకొకరు పని చేసుకునే పరిస్థితుల్లో లేక పోషించేవారు ఎవరూ లేరు. వైద్యం చేయించుకునే స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. నర్సిపూడి వెళ్లి సత్తిరెడ్డికి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.15 వేల చెక్కు అందజేసినట్టు తెలిపారు.

నూతన టీచర్లకు సేవా పుస్తకాల పంపిణీ



నూతన ఉపాధ్యాయులకు సేవా పుస్తకం అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కె.గంగవరం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సేవా పుస్తకాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు బళ్ల ఢమరుకనాదం ఇతర సభ్యులతో కలసి ఆయా పాఠశాలల్లో పర్యటించి 23 మంది ఉపాధ్యాయులకు సర్వీస్ రెజిస్టర్‌ను అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ సేవా పుస్తకం వారి ఉద్యోగ జీవితం అంతా ఉపయోగపడతుందన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో నూతన ఉపాధ్యాయులు రాణించి విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తుల మన్ననలు పొందాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఏదూరి వెంకటరమణ, గౌరవ అధ్యక్షుడు డి.లోవరాజు, నేదునూరి వేణుగోపాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాణసంచా విక్రయదారులు లైసెన్సులు తీసుకోవాలి



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ చినబాబు

అంబాజీపేట: బాణసంచా విక్రయదారులు తాత్కాలిక లైసెన్స్ తీసుకోవాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.చినబాబు అన్నారు. రానున్న దీపావళిని పురస్కరించుకుని తాత్కాలిక లైసెన్సుదారులు విక్రయించే స్థలాలు అంబాజీపేట, పుల్లేటికుర్రు, కె.పెదపూడి, ముక్కామల జెడ్పీ హైస్కూల్ ప్రాంగణాలను మంగళవారం తహసీల్దార్ పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాణాసంచా విక్రయ ప్రదేశాలను తనిఖీ చేస్తున్నామన్నారు. నిబంధనలకు అనుగుణంగా బాణసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. లైసెన్సులు లేకుండా బాణాసంచా విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ కె.ఏడుకొండలు , వీఆర్వోలు జీవీ రమణ, జి.వెంకటేశ్వరరావు, ఐవీవీ రమేష్ ఉన్నారు.

దారుణ ప్రయాణం

- కూటమి పాలనలో రహదారులు అధ్వానం
- గుంతలను మాత్రమే పూడ్చిన ప్రభుత్వం
- 20 శాతం పూర్తి చేయలేని సర్కార్
- రెండు నియోజకవర్గాల్లో నిలిచిన రోడ్ల విస్తరణ



భారీ గుంతలతో ఛిద్రమైన వెదురుమూడి–అంగర రోడ్డు

కపిలేశ్వరపురం: అధికారంలోకి రాగానే రహదారులను తీర్చిదిద్దుతామంటూ సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి అధినేత చంద్రబాబు ప్రజలకు గట్టిగా హామీ ఇచ్చారు. 'అందుకు నాదీ గ్యారంటీ, నన్ను నమ్మండి' అంటూ జనసేన అధినేత, ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలకు భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నీ పక్కకు పోయాయి. ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చినప్పుడు కొద్దిపాటి నిధులు విదిలించి.. గుంతలు మాత్రమే పూడ్చారు. అవి కాస్తా వర్షాలకు పూర్వ స్థితికంటే ప్రాణాంతకంగా మారాయి. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని ఆర్‌అండ్‌బీ రహదారులు ఛిద్రమై ప్రజలకు ప్రమాదభరితంగా మారాయి.

గుంతల్లో పడిపోతున్న జనం

అంగర–వెదురుమూడి, వెదురుమూడి–సంధిపూడి, నేలటూరు–వెదురుమూడి, కపిలేశ్వరపురం–అంగర ఇలా కపిలేశ్వరపురం మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారులు భారీ గుంతలతో దర్శనమిస్తున్నాయి. చినుకులు పడినప్పుడు నీటి గుంతల లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. కపిలేశ్వరపురం–అంగర రహదారిలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు గాయాల పాలయ్యారు. నియోజకవర్గ కేంద్రమైన మండపేటకు వెళ్లే కపిలేశ్వరపురం–నేలటూరు రహదారిలో పలు చోట్ల రహదారి ఛిద్రం కావడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక గోదావరి గట్టు రోడ్డు పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. ఇసుకను తరలించే భారీ వాహనాల రాకపోకల కారణంగా రహదారి భారీ గుంతలతో ఛిద్రమైంది.

విస్తరణకు నోచుకోక..

2016లో కపిలేశ్వరపురం–మండపేట రహదారి విస్తరణ పనులు చేపట్టారు. 16.2 కిలోమీటర్ల మేర, 3.5 మీటర్ల వెడల్పుతో ఉన్న రహదారిని ఏడు మీటర్లకు వెడల్పు చేసేందుకు ఆ రోజుల్లో రూ.16.03 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 11 కిలోమీటర్ల మేర తారు, 3.2 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డుగా మెరుగుపర్చారు. నిధుల సర్దుబాటు కారణంగా 14.2 కిలోమీటర్ల మేరకు మాత్రమే పనులు చేపట్టారు. దీంతో 1.7 కిలోమీటర్ల మేర కపిలేశ్వరపురం–అంగర రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. తొమ్మిదేళ్లగా కపిలేశ్వరపురం–అంగర ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ పనులు ఒక్క ఇంచు కూడా కదలని పరిస్థితి నెలకొంది. 19 గ్రామాలకు మండల కేంద్రంగా కపిలేశ్వరపురంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ కార్యకలాపాలన్నీ కపిలేశ్వరపురంలోని ఐసీడీఎస్ కార్యాలయ భవనంలోనే నిర్వహిస్తున్నారు. అక్కడకు వందల సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు వచ్చి వెళ్తుంటారు. కపిలేశ్వరపురంలోని సీహెచ్‌సీకి నేలటూరు, వల్లూరు, వెదురుమూడి, టేకి, నల్లూరు, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు అంగర–కపిలేశ్వరపురం రహదారి మీదుగా ప్రయాణిస్తారు. తాతపూడి, కపిలేశ్వరపురం ర్యాంపుల నుంచి ఇసుక లారీలు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. కపిలేశ్వరపురం, వెదురుమూడి, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని బట్టీల నుంచి ఇటుక వాహనాలతో రహదారి రద్దీగా ఉంటోంది. వ్యవసాయ ఉత్పత్తులు తరలించే వాహనాలతో పాటు, అంగర, ఆలమూరు, మండపేట, రామచంద్రపురం పట్టణాల్లోని విద్యా సంస్థలకు చెందిన వాహనాలు ఈ రహదారి మీదుగా వెళ్తుంటాయి.

రామచంద్రపురం నియోజకవర్గంలోనూ..

కాజులూరు మండలంలోని కుయ్యేరు–గొల్లపాలెం రహదారి నిర్మాణం అసంపూర్తిగా నిలిచింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 3 మీటర్లుగా ఉన్న రహదారిని 7 మీటర్లకు విస్తరించేలా, కల్వర్టుల నిర్వహణ కోసం రూ.37 కోట్లు మంజూరు చేసింది. ఓ వంతెనను పూర్తి చేయడంతో పాటు, 36 కల్వర్టులను నిర్మించింది. రహదారి విస్తరణ పనులు, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో రెండు వంతెనలు, గ్రామాల మధ్య రహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నిర్మాణం కోసం రహదారి పై పొరను తవ్వడంతో గుంతలు ఏర్పడ్డాయి. సుమారు 80 శాతం నిర్మాణం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తయింది. కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు దాటినా, మిగిలిన 20 శాతం నిర్మాణ పనులను చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జారి పడుతున్నారు



అంగర–కపిలేశ్వరపురం ఆర్‌అండ్‌బీ రహదారి ఛిద్రమైంది. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు జారి పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ప్రారంభ రోజుల్లో గుంతలను మాత్రమే పూడ్చారు. అవి సైతం ఛిద్రమయ్యాయి. అధికారులు స్పందించి రహదారిని పూర్తి స్థాయిలో నిర్మించాలి.

– పాలింగి శ్రీనివాస్, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం మండలం

ఐదో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్

రాయవరం: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ విషయాన్ని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ, కోనసీమ జిల్లాల కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రెండు జిల్లాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025–26 సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్లకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నందు ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల లోపు ఆన్‌లైన్ సెంటర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏ ఐటీఐ నందు చేరదలచుకున్నదీ దరఖాస్తులో ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మొదటి, రెండు, మూడు, నాలుగు విడతల్లో ఐటీఐ సీట్లు రాని అభ్యర్థులు కూడా తప్పనిసరిగా ఐదో విడతలో తిరిగి కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులందరూ దగ్గరలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ నందు ఈ నెల 16వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకుని, అప్రూవల్ పొందాలన్నారు. అప్రూవల్ చేయించుకోని దరఖాస్తుదారులు కౌన్సెలింగ్‌కు అర్హులు కారన్నారు. ప్రభుత్వ/ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఈ నెల 17న ఉదయం 8 గంటల నుంచి కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కౌన్సెలింగ్ దరఖాస్తు సమయంలో సందేహాలుంటే 08842348182/9440408182 నంబర్లను సంప్రదించాలని వేణుగోపాలవర్మ కోరారు.